## మహేంద్ర ట్రాక్టర్ ప్లాంట్‌లో సిఐటియు విజయం

**జహీరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:**
జహీరాబాద్ సమీపంలోని మహేంద్రా ట్రాక్టర్ ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సిఐటియు విజయం సాధించింది. కంపెనీ కార్మిక సంఘం యూనియన్ అధ్యక్షులు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు గెలుపొందారు. ఎన్నికలో 408 మంది కార్మికులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా, చుక్కా రాములుకు 217 ఓట్లు, బిఆర్‌టియు అభ్యర్థి రాంబాబుకు 190 ఓట్లు రావడంతో చుక్క రాములు తన సమీప ప్రత్యర్థి బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబుపై 27 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల్లో విజయం సాధించిన చుక్క రాములకు కార్మికులు శుభాకాంక్షలు తెలిపి కర్మాగారం ముందు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్, నాయకులు మాణిక్, మహిపాల్, రాజిరెడ్డి, గణేష్, వంశీకృష్ణ, సందీప్‌రెడ్డి, నారాయణ, నరసయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట వార్త

## విద్యారంగం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**-డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి**

**గజ్వేల్ టౌన్, మార్చి 20, ప్రభాతవార్త:**
తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.2 శాతం మాత్రమే కేటాయించడం రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ దళిత, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు కోరిన 20 శాతం, తెలంగాణ విద్యాకమిషన్ సూచించిన 18 శాతం, కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన 15 శాతం కూడా ఇవ్వకపోవడం మాటలకు, చేతలకు పొంతనలేదన్నారు. ప్రైమరీ తరగతుల నిర్వహణ, విద్యార్థుల కిట్, బ్రేక్‌ఫాస్ట్ పథకాలపై ప్రభుత్వం ప్రకటనలుచేసినా, తక్కువ బడ్జెట్‌వల్ల అవి అమలుకాక ప్రకటనలకే పరిమిత మయ్యే ప్రమాదం ఉందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీ వంటి హామీలను ఈ తక్కువ కేటాయింపులతో ఎలా అమలుచేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్‌చేశారు.

## ఎంపిని ఈటలను కలిసిన కౌన్సిలర్లు



ఎంపి ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బిజెపి నాయకులు, కౌన్సిలర్‌లు

**నర్సాపూర్, మార్చి 20, ప్రభాతవార్త:**
బిజెపి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్, నూతన నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్ దాస్‌లు హైదరాబాదులో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నర్సాపూర్ ప్రాంతంలో బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎంపి ఈటల రాజేందర్ వారికి సూచించారు.

## తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశావర్కర్ల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేస్తున్న మండల ఆశావర్కర్లు

**వెల్దుర్తి, మార్చి 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం మండల ఆశా వర్కర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, పని వత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇటీవలే తమపై పని ఒత్తిడి పెరిగిందని సకాలంలో వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని, రెండు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, పని భారాన్ని తగ్గించాలని వారు డిమాండ్‌చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు వినోద, మాధవి, లత, శోభ, యాదమ్మ, రూపకుమారి, అమృత, కళావతితో పాటు పలువురు పాల్గొన్నారు.

## రెడ్‌మిక్స్ పరిశ్రమ వల్ల పంటనష్టం.. ప్రాణనష్టం..

**పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల విన్నపం**



రెడ్‌మిక్స్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇస్తున్న రైతులు

**కొండపాక, మార్చి 20, ప్రభాతవార్త:**
కుకునూరుపల్లి శివారులోని శ్రీలక్ష్మీనర్సింహ్మా రెడ్‌మిక్స్ పరిశ్రమ వల్ల పంటలకు నష్టం జరుగుతుందని దానిపై చర్యలు తీసుకోవాలంటూ కుకునూరుపల్లి రైతులు శుక్రవారం పంచాయతీ కార్యదర్శిని కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెడ్‌మిక్స్ పరిశ్రమ నుండి వెలువడుతున్న దుమ్ము ధూళి అధిక మోతాదులో విడుదల అవుతుందన్నారు. దుమ్ము ధూళి వ్యవసాయ భూముల్లో చేరి పేరుకుపోయి పంటలు సరిగా పండడం లేదని, అంతేకాకుండా కొద్దోగొప్పో పండిన పంటలపై దుమ్ము ధూళి చేరడంవల్ల పంటలు సరిగా పెరగకుండా, పంటలు పండక తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నామని, అంతేకాకుండా కాలుష్యం వల్ల గ్రామస్థులు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పరిశ్రమ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లు భావిస్తున్నామని ఆ పరిశ్రమపై చర్యలు తీసుకొని కాలుష్య నియంత్రణ చట్టం అమలు చేయించాలని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పరిశ్రమపై చర్యలు తీసుకొని మాకు న్యాయంచేయాలని కోరారు. వినతి పత్రం అందించినవారిలో రైతులు నర్సింలు, కనకయ్య, స్వామి, అనిల్, లక్ష్మీనారాయణ, బాల్‌రాజు, శంకర్, మల్లేశం, కొండల్ తదితరులున్నారు.

## రైతుసంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**-గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**వర్గల్, మార్చి 20, ప్రభాతవార్త:**
రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ వరితో పాటు ఆయిల్‌పామ్ పంట సాగుకు అన్ని రకాలుగా రైతులను ప్రోత్సహిస్తూ సబ్సిడీలు అందజేస్తున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలపరిధిలోని అంబర్‌పేట గ్రామంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి కుమార్‌యాదవ్‌తో కలిసి సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్మెట్టలోని ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని సిఎం రేవంత్‌రెడ్డి ఈనెల 22వ తేదీన ప్రారంభించి రైతులకు అంకితం చేయనున్నట్లు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లాతో పాటు సమీప ప్రాంతాల అన్నదాతలు ఆయిల్‌పామ్ పంటను సాగుచేయగా, ఫ్యాక్టరీ ప్రారంభంతో వారు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతు సంబరాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టగా, నియోజకవర్గం నుండి రైతులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అదేరోజు సిఎం రేవంత్‌రెడ్డి రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయమోహన్, మండలపార్టీ మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటేష్, మాజీ ఎంపిటిసి నీల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వెలిమెల ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, మార్చి 20, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెలిమెలలో శుక్రవారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆఖరి శుక్రవారం ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. బిఆర్ఎస్ నాయకులు కాల్వగడ్డ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి ఇఫ్తార్ విందును ఆరగించారు. ముస్లింలకు రంజాన్ కానుకలను అందచేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్ఎష్ పార్టీ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు గూడెం మధుసూదన్‌రెడ్డి, పట్లోళ్ల రవీందర్‌రెడ్డి, ఒగ్గు సుచరితకొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

**-సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అడిషనల్ డిజిపి మహేష్ భగవత్**

**-ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్**



అయిల్ పాం ఫ్యాక్టరీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ డిజిపి, ఐజి, కలెక్టర్ తదితరులు

**నంగునూర్, మార్చి 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని నర్మెటలో ఈనెల 22న సిఎం చేతులమీదుగా ప్రారంభించనున్న ఆయిల్ పాంఫ్యాక్టరీలో అడిషనల్ డిజిపి మహేష్ భగవత్, ఐజి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.హైమావతి, సిపి రష్మీపెరుమాళ్, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవారెడ్డిలతో కలిసి పర్యటించారు. కార్యక్రమం నిర్వహించనున్న సభాప్రాంగణం, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లతో పాటు హెలీప్యాడ్ ఏర్పాటుచేసే ప్రదేశాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ప్రజాపాలన రైతు మహోత్సవం నిర్వహిస్తున్న ప్రదేశంలో ఏర్పాటుచేసిన స్టాళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణకు తగిన ప్రణాళిక రూపొందించాలన్నారు. పెద్దసంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని పార్కింగ్, రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎసిపి రవీందర్‌రెడ్డి, రూరల్ సిఐ శ్రీను, రాజగోపాల్‌పేట ఎస్ఐ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

**సిఎంపర్యటనలో అధికారులు విధులు పకడ్బందీగా నిర్వహించాలి...**

**అధికారులను ఆదేశించిన కలెక్టర్ హైమావతి...**

22న సిఎం పర్యటన సందర్భంగా ఆధికారిక పాస్‌లను జారీచేయడం జరుగుతుందని హెలీప్యాడ్, సిఎం కాన్వాయ్, ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, స్టాళ్ల సందర్శన, ఫ్యాక్టరీ పైలాన్ ఆవిష్కరణ వివిధనిర్మాణాల ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరించి బహిరంగసభలో సిఎం పాల్గొంటారని కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. నర్మెటలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిఎం పర్యటన నేపథ్యంలో విధులు కేటాయింపబడిన అధికారులు మాత్రమే ఉండి ఆయాశాఖలకు కేటాయించిన విధులను తు.చ. తప్పకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ సౌకర్యం, సౌండ్ సిస్టం, అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్, వైద్యశిబిరం, పార్కింగ్, విద్యుత్ సరఫరా ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొరవడిన నిఘా.. యథేచ్ఛగా గుట్కా దందా...




పాన్‌మసాలా ప్యాకెట్లు

**చిన్నశంకరంపేట, మార్చి 20, ప్రభాతవార్త:**
అధికారుల నిఘా కొరవడంతో మండలంలోని పలు గ్రామాల్లోని గుట్కా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలోపెట్టుకొని ప్రభుత్వం గుట్కా,పాన్‌మసాలా వంటివి నిషేధం విధించింది. రాష్ట్రప్రభుత్వం బ్యాన్ చేసినప్పటికీ కొందరు అక్రమార్కులు విక్రయాలను జోరుగా చేపడుతున్నారు. భాగ్యనగరం నుండి పట్టణాలకు, పట్టణాల నుండి మారుమూల పల్లెలకు గుట్కా రవాణాచేస్తున్నారు. పలు కిరాణాషాపుల్లో బహిరంగంగానే అమ్ముతున్నారు. అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో గుట్కా వ్యాపారులు రెచ్చిపోతున్నారు. పట్టణంలోని పారిశ్రామికవాడలో గుట్కా ప్యాకెట్‌లతో పాటు గంజాయి కూడా అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో కూడా పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. చిన్నశంకరంపేట నుండి మిర్జాపల్లి వెళ్లే రహదారిలో ఉన్న ఓ దుకాణంలో ఓ వ్యాపారి గుట్కాలతోపాటు గంజాయి కూడా అమ్ముతారనే ఆరోపణలు ఉన్నాయి. రోజూ వారికస్టమర్‌లకు మాత్రమే వాటిని అమ్ముతాడని, కొత్తవారు వెళ్లి అడిగితే ఇవ్వరని అందరికీ తెలిసిన బహిరంగ సత్యం. ఇటీవల ఓ గ్రామంలో అదే దుకాణం నుండి యువకులు గంజాయిని తెచ్చుకొని ఓ బంగ్లాపై త్రాగుతూ గ్రామస్థులకు కనిపించారు. వారి వద్దకు వెళ్లగా అక్కడినుండి వారు పరారయ్యారు. 90శాతంమంది యువత గంజాయికి, సిగరెట్లకు అలవాటుపడ్డారు. ఇదే అదునుగా భావించి అధికరేట్లు కూడా వసూలుచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుట్కా, పాన్‌మసాలా తినేవారు నోటి క్యాన్సర్‌ల బారినపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రజారోగ్యాన్ని, యువతను చెడుమార్గాల్లో నడిపించే పదార్థాలపై, వాటి విక్రయాలపై అధికారులు ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**అక్రమదందాను అరికట్టేందుకు చర్యలు...**
**-చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్**

ప్రభుత్వం నిషేధించిన పాన్‌మసాలా, గుట్కా వంటివి అమ్ముతున్నట్లు ఫిర్యాదువస్తే కచ్చితంగా సంబంధిత షాపులపై దాడులు నిర్వహిస్తాం. నిషేధించిన గుట్కా ప్యాకెట్లు ఎవరైనా అమ్ముతున్నట్లు తెలిస్తే, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం అందించినవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. గంజాయి అమ్మినా, వినియోగించినా వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. గుట్కా, గంజాయి, ఇతర మత్తుపదార్థాల రవాణాపై నిఘా కట్టుదిట్టంచేశాం. ఈ మధ్య గంజాయిని చాక్లెట్‌లలో పెట్టి అమ్ముతున్నారని సమాచారం ఉంది. పక్కా ఆధారాలతో పట్టుకుంటాము. దీనికి ప్రజల సహకారం అవసరం. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలపై నిఘా ఉంచాలి అని చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ ఈ సందర్భంగా తెలియజేశారు.

## జూదంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఉక్కుపాదం

**-నలుగురు అరెస్ట్.. ఇద్దరు పరారీ..**
**-రూ.4,750 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం**
**-ఎస్పీ డివి.శ్రీనివాసరావు**



పోలీసుల అదుపులో జూదరులు

**చిలిపిచెడ్, మార్చి 20, ప్రభాతవార్త:**
మెదక్‌జిల్లా చిలిపిచెడ్ మండలంలోని శిలాంపల్లిగ్రామ శివారులోని డంప్ యార్డు సమీపంలో అక్రమంగా జూదం ఆడుతున్న వారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ డివి.శ్రీనివాసరావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయినవారిలో వెంకటాపురం లక్ష్మణ్, జుకంటి లోకయ్య, మన్నె ప్రసాద్, యల్లయ్యగారి భూమ్‌రెడ్డి ఉన్నారు. ఈ ఘటనలో రాకేష్, పెద్దొల్ల సుధాకర్‌రెడ్డి పరారీలో ఉండగా, సంఘటనా స్థలం నుండి రూ.4,750 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఎక్కడైనా జూద కార్యకలాపాలు నిర్వహించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## జిల్లాలో సమృద్ధిగా గ్యాస్ సిలిండర్లు

**-గ్యాస్ సమస్యను సృష్టిస్తే చర్యలు తీసుకుంటాం**
**-విద్యార్థులకు మెనూను తప్పక అమలుచేయాలి**
**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**




టేక్మాల్‌లో గ్యాస్ గోదాంను తనిఖీ చేస్తున్న దృశ్యం

**టేక్మాల్, మార్చి 20, ప్రభాతవార్త:**
గ్యాస్ వినియోగదారులు గ్యాస్ సమస్యపై చింతించాల్సిన అవసరం లేదని, జిల్లాలో సరిపడ గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం టేక్మాల్ మండలకేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. ఆగ్రో సేవాకేంద్రాన్ని, గ్యాస్ గోదామును పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ కెజిబివి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. కెజిబివి పాఠశాలలో స్టోర్ రూంను, కిచెన్, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ గ్యాస్ సమస్యను సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు మెనూను తప్పక అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. కెజిబివి పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ తప్పక అమలు చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, ఉచిత విద్య, అందించాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆగ్రో సేవాకేంద్రంలో పలురికార్డులు, స్టాక్ వివరాలు పరిశీలించారు. రైతులకు అన్ని మందులు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, యూరియాను త్వరితగతిన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తులసిరాం, మండల వ్యవసాయాధికారి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బెదిరించి డబ్బులు వసూలు చేసిన నేరస్థుల అరెస్ట్

**-పోలీసులమని చెప్పి పశువులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డగించి డబ్బులు వసూలుచేసిన నకిలీ పోలీసులను పట్టుకున్న పోలీసులు**



నేరస్థులను అరెస్ట్‌చేసిన పోలీసులు

**కొండపాక, మార్చి 20, ప్రభాతవార్త:**
జగిత్యాల జిల్లా నక్కలగుట్టకు చెందిన ఎండి రహీం తన తండ్రి పశువుల వ్యాపారి ఈ నెల 16న రహీం వారి వాహనంలో అతని డ్రైవర్‌తో కలిసి కోరుట్ల పశువుల అంగడిలో 18 బర్రె దూడలను కొనుగోలు చేసి వాహనంలో ఎక్కించుకొని ఘట్కేసర్ దగ్గరలోగల కొండమడుగుగ్రామ అంగడిలో అమ్మడానికి రాత్రి 12 గంటలకు వెళ్తున్నారని బుధవారం ట్రైనీ ఐపిఎస్ అధికారి, కుకునూరుపల్లి ఇంచార్జి ఎస్‌హెచ్ఓ ఆయేషా ఫాతిమా, గజ్వేల్ ఎసిపి నర్సింహులు, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో తిమ్మారెడ్డిపల్లి శివారులోని కాలింగపట్నం హోటల్ దగ్గరలో రాగానే కొంతమంది వారు ప్రయాణిస్తున్న వాహనానికి అడ్డంగా ఫార్చునర్ కారును పెట్టి కారులో ఉన్న నలుగురు వ్యక్తులు కారుదిగినట్లు ఆమె వివరించారు. బర్రెలను తరలిస్తున్న వాహనంలోకి ఇద్దరు వ్యక్తులు ఎక్కి తాము పోలీసులమని చెప్పి కారులో సిఐ, ఎస్సై కారులో కూర్చున్నారని బెదిరిస్తూ పశువులను ఎటు తరలిస్తున్నారని, పోలీస్ స్టేషన్‌కు పదండి అంటూ వారిని బెదిరిస్తూ 50వేల రూపాయలు డిమాండు చేసారని తెలిపారు. రహీం వారిని బ్రతిమిలాడి అయన వద్ద ఉన్న 17వేల రూపాయలను ఇచ్చి, వారికి మరో 17వేల రూపాయలను ఫోన్‌పే ద్వారా చెల్లించినట్లు తెలిపారు. డబ్బులు ఇవ్వగానే వారు వచ్చిన ఫార్చునర్ కారులో పారిపోయినట్లు వివరించారు. రహీం ఫిర్యాదు మేరకు గజ్వేల్ ఎసిపి నర్సింహులు, తొగుట ఇంచార్జి సిఐ రవిరాజు, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్‌లు 24 గంటల్లో కేసును ఛేదించి సామల సాయికుమార్ సిద్దిపేట, ఎండి యాకుబ్ సిద్దిపేట, ముద్రకోల శశికుమార్ సిద్దిపేట, ఎండి సోహేల్ సిద్దిపేట అనే నేరస్థులను పట్టుకున్నట్లు తెలిపారు. నేరస్థుల నుండి ఫార్చునర్ కారును, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు. కేసు నమోదుచేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్ఓ ఫాతిమా తెలిపారు.

## తైబజార్, పశువుల సంత వేలం

**-మున్సిపల్‌కు రూ.89 లక్షల ఆదాయం**



వేలంపాట నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటగోపాల్

**గజ్వేల్ టౌన్, మార్చి 20, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్‌చైర్మన్ గంగిశెట్టి చందనరవీందర్ అధ్యక్షతన కమిషనర్ ఆర్.వెంకటగోపాల్ ఆధ్వర్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికిగానూ తైబజార్, పశువులసంత వేలంపాట నిర్వహించారు. ముందుగా తైబజార్ వేలం నిర్వహించగా ఇందులో 21మంది పాల్గొనగా, ఈ.బిక్షపతి రూ.70లక్షలకు వేలం పాడి తైబజార్‌ను దక్కించుకున్నారు. పశువుల సంత వేలంలో 32మంది పాల్గొనగా అత్యధికంగా టి.రాజేశం రూ.19లక్షలకు వేలంపాడి దక్కించుకున్నారు. ఈ వేలంపాటలో మున్సిపల్‌కు రూ.89 లక్షల ఆదాయం సమకూరినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గసభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉగాది సంబరాలు..

**చిన్నశంకరంపేట, మార్చి 20, ప్రభాతవార్త:**
మండలవ్యాప్తంగా ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగ సందర్భంగా మండల పరిధి గజగట్లపల్లిలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి అలంకరించిన ఎద్దుల బండ్లు వెంకటేశ్వర స్వామి ఆలయం చుట్టూ ఊరేగించగా గ్రామస్థులు తిలకించారు. అలాగే చిన్నశంకరంపేటలో దుర్గామాత ఆలయం వద్ద బండ్లను ఊరేగించారు.

## రంజాన్‌కు సిద్ధమైన మసీదులు



అంబాజీపేటలో రంజాన్‌కు ముస్తాబైన మజీదు

**చిన్నశంకరంపేట, మార్చి 20, ప్రభాతవార్త:**
రంజాన్ ముస్లింలకు ఎంతో పవిత్రమైన మాసం. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మండల పరిధి అంబాజీపేటలోని మజీదు, విద్యుత్తు కాంతులతో అలకరించారు. శుక్రవారం నెల వంక కనిపిస్తే శనివారం రంజాన్ పండుగను జరుపుకుంటామని, మత గురువులు తెలిపారు. ఈద్గాలలో ప్రార్థనకు వచ్చే వారికి మజీదుల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## నష్టం చేకూర్చే పరిశ్రమకు అనుమతులు ఇవ్వం

**-సర్పంచి ప్రవిణ్‌కుమార్**



చందంపేటలో గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచి ప్రవిణ్

**చిన్నశంకరంపేట, మార్చి 20, ప్రభాతవార్త:**
గ్రామానికి నష్టం కలిగించే ఎలాంటి పరిశ్రమలు వచ్చినా అనుమతులు ఇచ్చేదిలేదని చందంపేట ప్రవిణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం గ్రామస్థులు సమక్షంలో గ్రామ సభను నిర్వహించి గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వారితో చర్చించారు. ఇటీవల గ్రామ శివారులో ఓ రసాయన పరిశ్రమ ఏర్పాటుకు యజమాన్యం సిద్ధపడగా అడ్డుకున్నామని, కలెక్టర్‌కు కూడ ఫిర్యాదు చేసినట్లు సర్పంచి తెలిపారు. ఇప్పటికే ఉన్న పరిశ్రమ పోగ, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, మరో పరిశ్రమను ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదన్నారు. గ్రామస్థుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కొందరు పరిశ్రమ ఏర్పాటుకు యజమానులకు అనుకూలంగా మారి గ్రామానికి నష్టం కలిగించేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ, ఆయా పార్టీల నాయకులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు దరఖాస్తుల ఆహ్వానం

**సిద్దిపేట అర్బన్, మార్చి 20, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్(1) సబ్జెక్టు విద్యా కమీషనర్ ఉత్తర్వుల మేరకు అర్హులైన అభ్యర్థుల నుంచి 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 23 సాయంత్రం 4 గంటల వరకు కళాశాలలో దరఖాస్తులను అందజేయాలన్నారు. 24న కళాశాలలో ఉదయం 10 గంటలకు అర్హత పత్రాల పరిశీలన, డెమో, ఇంటర్వ్యూ ప్రక్రియ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పిజిలో కనీసం 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు పిజిలో కనీసం 50 మార్కులు, బిఈడి చేసిన వారికి తగు ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పిహెచ్‌డి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు.

## నవోదయలో సీటుపొందిన విద్యార్థికి సన్మానం



విద్యార్థి తనుష్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**జగదేవ్‌పూర్, మార్చి 20, ప్రభాతవార్త:**
జగదేవ్‌పూర్ మండల పరిధిలోని బిజివెంకటాపూర్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యను అభ్యసిస్తున్న పోకల తనుష్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి గానూ ప్రవేశ పరీక్ష రాసి ఎంపిక కావడంతో శుక్రవారం విద్యార్థి తనుష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాత్లావత్ బొద్దునాయక్, మునిగడప జెడ్‌పిహెచ్ఎస్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు క్యాసారం కనకయ్యలు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ కష్టపడి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి నవోదయ విద్యాలయానికి ఎంపిక కావడం అభినందనీయమని, తనుష్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి కష్టపడి విద్యనభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి రమణ, విద్యార్థి తండ్రి పోకల రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొడకండ్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్ టౌన్, మార్చి 20, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో సిసి రోడ్డు, మురికి కాల్వల నిర్మాణానికి శుక్రవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ విరూపాక శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు దశల వారీగా నెరవేరుస్తూ ప్రజల ఆదరణ పొందుతున్న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో కొడకండ్ల గ్రామానికి మరిన్ని నిధులు వచ్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముంద్రాతి లక్ష్మి, ఉపసర్పంచ్ జ్యోతి నర్సింలు, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ మాదాడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి తుప్పతి అంజియాదవ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి దిశానిర్దేశం

**-మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య**

**రాయపోల్, మార్చి 20 (ప్రభాతవార్త):**
తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా ఉందని రాయపోల్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను రూపొందించిందని అన్నారు. రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇచ్చిన ఈబడ్జెట్ ప్రశంసనీయమని, ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క సమన్వయంతో ఆర్థిక ప్రణాళికలు సమర్థవంతంగా అమలు అవుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం, రైతులకు సబ్సిడీలు మరియు పథకాలు కొనసాగించడం ఆనందదాయకమని తెలిపారు. మార్కెట్‌యార్డుల అభివృద్ధి, రైతులకు మెరుగైన సదుపాయాల కల్పన కోసం కేటాయింపులు చేయడం మంచి నిర్ణయమన్నారు. అదేవిధంగా విద్య, వైద్యం, మౌలిక వసతుల రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం రాష్ట్ర పురోగతికి దోహదపడుతుందని చెప్పారు. ఈ బడ్జెట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ఈ బడ్జెట్ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తుందని పేర్కొన్నారు.

## జడ్పిహెచ్ఎస్‌కు ప్రహరీ గోడ నిర్మాణం



జడ్పిహెచ్ఎస్‌కు ప్రహరీగోడ నిర్మాణం పనుల దృశ్యం

**అల్లాదుర్గం, మార్చి 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరి గోడ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ప్రహరిగోడ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పాఠవాలకు ప్రహరిగోడ లేక మూగ జీవాలు పాఠశాల ఆవరణలోకి వస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొన్న అవస్థలు అన్ని ఇన్నీ కావు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రహరిగోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు ఉప సర్పంచ్ కళాయి పాండు, వార్డు సభ్యులు యాదగిరిలు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు తమ వంతు సహకారం అందిస్తామని ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పాఠశాల పూర్వ విద్యార్థులు కళాయి పాండు, యాదగిరిలు వివరించారు.

## సిసి రోడ్డు పనులకు శ్రీకారం



సిసి రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న గొల్ల మల్లేశం

**చౌటకూరు, మార్చి 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఉప్పరిగూడెంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద మంజూరైన 14 లక్షల రూపాయలతో శుక్రవారం సిసి రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ గొల్ల మల్లేశం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా చొరవతో గ్రామానికి నిధులు మంజూరు అయినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కలాలి ఈశ్వర్‌గౌడ్, మండల శివకుమార్, మాజీ సర్పంచ్ గొల్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

**చౌటకూరు, మార్చి 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పోచారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకున్న గ్రామానికి చెందిన బెస్త లక్ష్మీ ఇంట్లోకి శుక్రవారం గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగారి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా హనుమన్నగారి నరేందర్‌రెడ్డి

**వెల్దుర్తి, మార్చి 20, ప్రభాతవార్త:**
మండలంలోని మానేపల్లి గ్రామానికి చెందిన హనుమన్నగారి నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు చేయడం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ తనపై నమ్మకంతో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తనకు బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. తన బాధ్యత పెరిగిందని అందుకు నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. అలాగే మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రామానికి చెందిన కొమ్మిరిశెట్టి నంబూద్రిగుప్తా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమించడం జరిగిందని అందుకు పార్టీకి కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని వారన్నారు.

## నిరుపేదలకు వరం సిఎం రిలీఫ్‌ఫండ్

**-గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్త**

**ములుగు, మార్చి 20, ప్రభాతవార్త:**
నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం అని ములుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్త అన్నారు. ఇటీవల ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న మండల పరిధిలోని కొట్యాల, ములుగు, కొక్కొండ, బహిలంపూర్, అడవిమజీద్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.3.60లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను గంగిశెట్టి శ్రీనివాస్‌గుప్త శుక్రవారం వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్‌యాదవ్, మండల వర్కింగ్‌ప్రెసిడెంట్ ఆంజనేయులుతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ ప్రజాపాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాలపల్లి యాదగిరి, మారమైన బాలేష్, శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బండ్ల ఊరేగింపులో జంగం రమేష్‌గౌడ్



ఎడ్లబండ్ల ఊరేగింపులో జంగం రమేష్‌గౌడ్, నాయకులు

**గజ్వేల్ టౌన్, మార్చి 20, ప్రభాతవార్త:**
పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని శ్రీమహంకాళి అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన ఎడ్లబండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించగా, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జంగం రమేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మహంకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అబ్బగోని రాజ్‌కుమార్‌గౌడ్, మైసరి సూర్యకుమార్, దేవేందర్, కనకస్వామి, సురేష్, రాజు, నరేష్, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

**-మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

**ములుగు, మార్చి 20, ప్రభాతవార్త:**
గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ములుగు మండల పరిధిలోని అచ్చాయిపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ బుర్కల మమత కనకయ్య, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కొన్యాల బాల్‌రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ కొడితెల ప్రభాకర్‌గుప్తతో కలిసి సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి అందుతున్నాయని, రేవంత్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు. జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రవర్తిస్తున్నాయని, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్, తారక సురేష్, ఉపసర్పంచ్ లక్ష్మి స్వామి, వార్డు సభ్యులు వినోద్, సత్తయ్య, మమత రాజు, లక్ష్మినర్సింలు, శివ, కొమ్ము కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీలత వెంకటేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చెత్త విభజనపై అవగాహన



చెత్త విభజనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, మార్చి 20, ప్రభాతవార్త:**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఆరో వార్డులో చెత్త విభజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ దండి లక్ష్మీ మాట్లాడుతూ పట్టణ ప్రజలు తమ ఇళ్లలోనే చెత్తను తడి చెత్త, పొడిచెత్తగా వేరుచేసి మున్సిపల్ వాహనానికి అందించాలని సూచించారు. పొడిచెత్తను రీసైక్లింగ్ సెంటర్‌కు పంపించి, తడిచెత్తతో ఎరువు తయారుచేస్తామని, తయారుచేసిన ఎరువులను మొక్కలకు వినియోగించుకోవచ్చని, ఇంటి వద్ద ఖాళీ ప్రదేశం ఉన్న వారు హోమ్ కంపోస్టింగ్ విధానాన్ని పాటించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని, ఇంటిపరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత రంజాన్ డబ్బాలు, టైర్లు, కుండలు, కొబ్బరి బొండాలలో నీరు నిల్వ ఉంటే వెంటనే తొలగించుకోవాలన్నారు. అనంతరం వార్డులో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నిర్వహించి, దోమల నివారణ చర్యలుగా స్ప్రే చేయించడం, బ్లీచింగ్ చల్లించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ సంపత్, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, మాజీ ఎంపీపీ వెంకట్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్, జవాన్ సారయ్యతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి



గాలికుంటు టీకాలు వేస్తున్న సర్పంచి

**చిలిపిచెడ్, మార్చి 20, ప్రభాతవార్త:**
ప్రతి పశువుకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని చిట్కుల్ వెటర్నరీ అసిస్టెంట్ గట్టయ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన చిలిపిచేడ్ గ్రామాల్లో పశువుల గాలి కుంట నివారణ టీకాలను సర్పంచ్ జూలా అనిల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధికి సంబంధించిన టికాను ప్రతి పశువుకి తప్పకుండా ఇప్పించుకోవాలని, ఈ టీకాలు తీసుకోవడం వలన వ్యాధికి సంబంధించిన వ్యాధి నిరోధక శక్తి పశువుల్లో తయారై పశువులను వ్యాధి బారిన పడకుండా కాపాడుతుందని, వ్యాధి నిరోధక శక్తి పెరిగి పశువులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు పశువులపెరుగుదల కూడా బాగుంటుందని రైతులందరికి వివరించడం జరిగింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీరాములు వెటర్నరీ సిబ్బంది యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

## సూరంపల్లిలో ఉచిత వైద్య శిబిరం

**-130 మందికి వైద్య పరీక్షలు, 29 మందిని రెఫర్**



సూరంపల్లిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**టేక్మాల్, మార్చి 20, ప్రభాతవార్త:**
గ్రామీణప్రజలకు చేరువగా వైద్య సేవలు అందించాలనే మాల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరంలో 130 మందికి పరీక్షలు నిర్వహించి 29 మందిని హైదరాబాద్‌లోని మాల్లారెడ్డి ఆసుపత్రికి రెఫర్ చేశారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు చేశారు. పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు, అవసరమైనవారికి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ మాల్లారెడ్డి ఆసుపత్రికి రెఫర్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని గ్రామ సర్పంచ్ మైలారం పోచయ్య తెలిపారు. ఇలాంటి సేవలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని నిర్వాహకులు, వైద్యులు నిరంజన్‌రమణ, కిరణ్‌లు పేరొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పవని, శ్రావణి, మార్కెటింగ్ పవన్ కుమార్‌తో పాటు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలి

**-కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఆనంద్**

**సిద్దిపేట అర్బన్, మార్చి 20, ప్రభాతవార్త:**
సిద్దిపేట పట్టణంలోని 37వవార్డులో శుక్రవారం రంజాన్ సందర్భంగా కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఆనంద్ చేతులమీదుగా ముస్లింలకు బియ్యం పంపిణీ చేశారు. వార్డులోని 30మంది ముస్లిం కుటుంబాలకు 26కిలోలచొప్పున బియ్యం పంపిణీచేశారు. రంజాన్‌ను సుఖఃసంతోషాలతో జరుపుకోవాలని అకాంక్షించారు. కార్యక్రమంలో గుజ్జరి రాందాస్, డిసి నర్సింలు, తాండ నవీన్, బయ్యాం యాదగిరి, కాటం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## టేకూర్‌లో రంజాన్ తోఫాల పంపిణీ

**న్యాల్‌కల్, మార్చి 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని టేకూర్ గ్రామంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని మైనార్టీలకు శుక్రవారం గ్రామ సర్పంచి ఎంటూరు సంగీతనాగేశ్వర్ రంజాన్ తోఫాలను పంపిణీచేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీలు, నాయకులు పాల్గొన్నారు.

## చింతమడక పిహెచ్‌సిలో ఉచిత వైద్య శిబిరం




వైద్య శిబిరంలో పాల్గొన్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, మార్చి 20, ప్రభాతవార్త:**
సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన జనరల్ మెడిసిన్, పిల్లల, స్త్రీల, కంటి వైద్య నిపుణులు ఆర్థోపెడిక్, డెంటల్ వైద్యులు శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 171మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 20మంది రక్త నమూనాలు సేకరించి టి.హబ్‌కు పంపారు. 30మందిని జిజిహెచ్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో చింతమడక పిహెచ్‌సి డాక్టర్ మంజుల, సిహెచ్‌ఓ లింగయ్య, సూపర్‌వైజర్ సుధారాణి, అంబేద్కర్, నసీమా, సుజాత, నారాయణరావుపేట వైద్యసిబ్బంది నరేష్, అనురాధ, భూంపల్లి రాజు, కరుణావతి, సంతోష, సుజాత, పద్మలు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

**జగదేవ్‌పూర్, మార్చి 20, ప్రభాతవార్త:**
పేదలకు ఆపదలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని తీగుల్ మాజీ సర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు అన్నారు. మండలపరిధిలోని తీగుల్‌గ్రామానికిచెందిన చిన్నబొక్కల పెద్ద నర్సింలు, వంక అయ్యాలం, సాయికుమార్, రమ్యశ్రీలు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది ముఖ్యమంత్రి సమాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మంజూరైన రూ.1.50 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరు కాగా అట్టి చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా భానుప్రకాష్‌రావు మాట్లాడుతూ టిపిసిసి అధికారప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు సహకారంతో సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించామని తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతిపేదవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరంగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చౌదరి కరుణాకర్, మాజీ వార్డుసభ్యులు నర్సింలు, కొండపోచమ్మ డైరెక్టర్ ఆశయ్య, కాంగ్రెస్‌నాయకులు దయ్యాల కిష్టయ్య, రాజు, మహేష్, భూమేష్, కుమార్ పాల్గొన్నారు.

## అల్లాదుర్గంలో ముస్లింలకు రంజాన్ తోఫాల పంపిణీ

**అల్లాదుర్గం, మార్చి 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని మహిళా సమైఖ్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మైనార్టీ ముస్లిం సోదరులకు వట్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ లక్ష్మీశేసారెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి, తహసీల్దార్ మల్లయ్యలు రంజాన్‌తోఫాలను పంపిణీచేశారు. మంత్రి దామోదర్ రాజనర్సింహా సూచనలమేరకు ముస్లింలకు రంజాన్ తోఫాలను పంపిణిచేసినట్లు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు సుభాష్‌రావు, భాస్కర్, ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం, ప్రధాన కార్యదర్శి బాలకిషన్, ఉపాధ్యక్షులు సాయిబాబా, బిసిసెల్ మండల అధ్యక్షులు నర్సింలు, యువజన కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షులు కురుమ మహేష్, సోషల్‌మీడియా జైపాల్, సర్పంచ్‌లు శశిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హరి, శంకర్‌నాయక్, వీరన్న, మన్న నాయక్, గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ పండు, కృష్ణ, నాయకులు విఠల్, భూమరెడ్డి, బేతయ్య, సాయిలు, శ్రీనివాస్, శ్రీశైలం, విఠల్‌రెడ్డి, బాల్‌రాజ్, పాపయ్య, రోషన్, శ్రీను, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బస్వాపూర్‌లో రంజాన్ కానుకల పంపిణీ

**చౌటకూరు, మార్చి 20, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బస్వాపూర్‌లో శుక్రవారం రంజాన్ పర్వదినాన్ని పురష్కరించుకుని సర్పంచ్ పట్లోళ్ల భూంరెడ్డి మైనార్టీ సోదరులకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంజాన్ కానుకలను అందచేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా చొరవతో పేదముస్లింలు పండగను ఆనందోత్సవాలతో జరుపుకునేందుకు కానుకలను పంపిణి చేసేందుకు యత్నించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వినోద రాజు, మండల కాంగ్రెష్ పార్టీ మైనార్టీ నాయకులు ఇమ్రాన్, పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్, మాజీ సర్పంచ్ సుభాష్‌గౌడ్, వార్డు సభ్యులు ఇంతియాజ్, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## బొడ్మట్‌పల్లిలో రంజన్ తోఫా పంపిణీ

**టేక్మాల్, మార్చి 20, ప్రభాతవార్త:**
రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం మంజూరు చేసిన రంజాన్ తోఫా బొడ్మట్‌పల్లి పార్టీ అధ్యక్షులు శంకరప్ప, గ్రామ సర్పంచ్ అవినాష్ కుమార్‌లు శుక్రవారం మైనార్టీ సోదరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పండగలు అందరూ సమానంగా జరుపుకోవాలనే లక్ష్యంతో ధనిక పేద తారతమ్య భేదాలు లేకుండా అందరూ సమానంగా జరుపుకునేందుకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తుందని అన్నారు. మైనార్టీ సోదరులు నెల రోజులపాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపడుతారని రంజాన్ పండగ భక్తి భావనకు నిదర్శనమని పండుగ శాంతియుత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పార్టీ నాయకులు, మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

## పేదమైనార్టీల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**-పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు కడపల్ల నరసింహారెడ్డి**

**ములుగు, మార్చి 20, ప్రభాతవార్త:**
పేదమైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు కడపల్ల నరసింహారెడ్డి అన్నారు. మండలకేంద్రమైన ములుగులో ప్రభుత్వం పంపిణీ చేసిన రంజాన్ తోఫా కిట్లను మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కుతాడి శ్రీనివాస్, వాహిద్, వార్డు సభ్యుడు మంద వెంకటేష్, జిల్లా నాయకులు తీగుళ్ల కుమార్, నరేందర్‌రెడ్డి, జాఫర్‌పాషాలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ పేదలకు ఎల్లవేళలా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా ఉండి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని కొనియాడారు. రంజాన్ రోజున నిరుపేదలు ఎవరూ నిరాశ చెందవద్దని రంజాన్ కానుకను ప్రభుత్వం ఈద్ తోఫా అందజేసిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఖదీర్, షాదు, ఆజామ్, కౌసర్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## మండలి ప్రభుత్వవిప్‌గా వెంకట్ నియామకంపై హర్షం

**ఘట్‌కేసర్, మార్చి 20, ప్రభాతవార్త:**
తెలంగాణ శాసనమండలిలో ప్రభుత్వవిప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్‌ను మేడ్చల్‌జిల్లా ఎన్ఎస్‌యుఐ కార్యదర్శి నానావత్ శివాజీనాయక్ సన్మానించారు. శుక్రవారం శివాజీనాయక్ ఎమ్మెల్సీ వెంకట్‌ను ఆయననివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా శివాజీనాయక్ మాట్లాడుతూ విద్యార్థినాయకుడిగా అంచెలంచెలుగా ఎదిగి ఎమ్మెల్సీగా మండలిలలో ప్రభుత్వవిప్‌గా నియమించడం హర్షణీయన్నారు. వెంకట్ ప్రభుత్వవిప్‌గా నియమితులు కావడం పట్ల శివాజీనాయక్ హర్షం వ్యక్తంచేశారు.

## శ్రీగురుపీఠంలో అక్కల్‌కోట మహారాజ్ జయంతి

**-ప్రత్యేకపూజలు చేసిన గురుపీఠం ఛైర్మన్ శివకుమార్‌గౌడ్**

**శివంపేట, మార్చి 20, ప్రభాతవార్త:**

కలియుగంలో నాలుగవ దత్తావతారంగా భావించే శ్రీ అక్కల్‌కోట మహారాజ్ జయంతి, చైత్ర శుద్ధ పాడ్యమి ఉగాదిపండుగను పురస్కరించుకొని శివంపేటలోని శ్రీగురుపీఠంలో శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది జిన్నా రం పెద్దగోని శివకుమార్‌గౌడ్ ప్రత్యేకపూజలు చేశారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ మహారాజ్ తన జీవితకాలంలో అనేకమంది భక్తులపై కరుణ చూపి వారి జీవితాలను సుసంపన్నం చేశారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పర్యటించిన ఆయన చివరకు అక్కల్‌కోటలో ఆశ్రమం స్థాపించి భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేశారని వివరించారు. శ్రీఅక్కల్‌కోట మహారాజ్ స్మరణ మాత్రమే మన జీవితాల్లోని అనేక సమస్యలను తొలగించే శక్తి కలిగి ఉందని విశ్వసిస్తారని తెలిపారు. ఈనేపథ్యంలో మహారాజ్ జయంతి, ఉగాది పండుగలను కలిపి శ్రీగురుపీఠంలో జరుపుకునే అవకాశం దొరకడం భక్తులకు పూర్వజన్మ సుకృతఫలమని అన్నారు. ఈకార్యక్రమాల సందర్భంగా భక్తులకు ప్రత్యేకదర్శనం, పూజలు, ప్రసాదాలపంపిణీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సూర్యంకుమార్‌గౌడ్, కొంతాన్‌పల్లి సత్యనారాయణగౌడ్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


పూజలలో పాల్గొన్న శ్రీగురుపీఠం ఛైర్మన్ శివకుమార్‌గౌడ్

## శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**జహీరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:**

జహీరాబాద్ పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆత్మకమిటీ చైర్మన్ రామలింగారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా రామలింగారెడ్డి మాట్లాడుతూ శనగలకు మద్దతుధర కల్పించేందుకు నాఫెడ్ ఆధ్వర్యంలో మార్కెఫెడ్ సౌజన్యంతో కొనుగోలుకేంద్రాన్ని ఏర్పాటుచేశామన్నారు. క్వింటాలుకు 5875 రూపాయల మద్దతుధరను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎకరాకు 7 క్వింటాళ్ల చొప్పున శనగలను రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకురావచ్చన్నారు. కొనుగోలుకేంద్రానికి శనగలు తరలించాక వారం వ్యవధిలో రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు క్రెడిట్ అవుతుందన్నారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ ముబీజ్, వ్యవసాయ అధికారిణి ఎన్. లావణ్య, ఏఈఓ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్ నామ స్రవంతి, డిసిఎంఎస్ డైరెక్టర్లు, కొనుగోలుకేంద్రం ప్రతినిధి దత్తు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆత్మకమిటీ చైర్మన్ రామలింగారెడ్డి

## అజ్జమర్రిలో ఘనంగా ఎర్రపోచమ్మకు బోనాలు


బోనాలు ఊరేగిస్తున్న గ్రామస్థులు

**చిలిపిచెడ్, మార్చి 20, ప్రభాతవార్త:**

ఉగాది పండగను పురస్కరించుకొని మండల పరిధిలోని అజ్జమర్రి భక్తులు ఎర్రపోచమ్మకు ఘనంగా బోనాలు నిర్వహించారు. మండలపరిధిలోని అజ్జమర్రి ఊరుశివారులో ఉన్న ఎర్రపోచమ్మకు శుక్రవారం గ్రామస్థులు బోనాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అలంకరించేందుకు ప్రభను ఊరేగింపుగా, డప్పు వాయిద్యాలతో, డోలుచప్పుళ్లతో మహిళాభక్తులు బోనాలను ఎత్తుకొని అమ్మవారి ఆలయంచుట్టూ ప్రదక్షిణలుచేసి బోనాలు సమర్పించుకున్నారు. అనంతరం ధూప, దీప, నైవేద్యాలు, తీపిపదార్థాలను అమ్మవారికి సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు.

## అల్లా దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలి

**రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన హరీష్‌రావు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఈద్-ఉల్-ఫితర్(పవిత్ర రంజాన్) పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాసదీక్షలకు రంజాన్ ముగింపు వేడుక అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద గొప్ప పండుగల్లో ఒకటి రంజాన్ అన్నారు. లౌకికవాదం, మతసామరస్య పరిరక్షణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కులమతాలకతీతంగా ఒకరిపండుగలను మరొకరు సోదరభావంతో కలిసిమెలిసి జరుపు కునే సంస్కృతి తెలంగాణలో ఉందన్నారు. అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకలశుభాలు కలగాలని అకాంక్షించారు.

## శాసనమండలి ప్రభుత్వ విప్‌కు ఘనసత్కారం


డాక్టర్ బల్మూరి వెంకట్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, మార్చి 20, ప్రభాతవార్త:**

రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ విప్‌గా ఎన్నికైన డాక్టర్ బల్మూరి వెంకట్‌ను హైదారాబాద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ నాయకులు దాసరి రాజు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండలవాడి సతీష్‌లు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈనెల 22న నంగునూర్‌మండలం నర్మెటగ్రామంలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీని ప్రారంభించడానికి సిఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున ప్రారంభోత్సవ కార్యక్రమం చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజు, భరత్ తదితరులు ఉన్నారు.

## నేత్రపర్వంగా బోనాల ఊరేగింపు


శ్రీఅన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

**చౌటకూరు, మార్చి 20, ప్రభాతవార్త:**

మండలకేంద్రమైన చౌటకూరులోని శ్రీఅన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామి ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం పోచమ్మ, దుర్గమ్మలతోపాటు గ్రామదేవతలకు ఊర బోనాలు నిర్వహించారు. డీజె చప్పుళ్లు, డోలు, వాయిద్యాల మధ్య బోనాల ఊరేగింపు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అగ్నిగుండాల కార్యక్రమం కొనసాగింది. జోగినీ మహిళల పూనకాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతరకు హైద్రాబాద్ నుంచి ప్రత్యేకంగా సర్పంచి పార్కల రాంరెడ్డి కళాకారులను రప్పించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## పసిపాపకు గుండె ఆపరేషన్ చేయించిన మాజీ ఎఫ్‌డిసి చైర్మన్

**జగదేవ్‌పూర్, మార్చి 20, ప్రభాతవార్త:**

జగదేవ్‌పూర్ మండలపరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన అన్నమైన సరిత, సిద్ధులు దంపతుల కుమార్తె అనూష (13నెలలు) పుట్టుకతోనే గుండె సమస్యతో బాధపడుతుంది. హైద్రాబాద్‌లోని ఓప్రైవేట్ ఆసుపత్రిని ఆశ్రయించగా రూ.6లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో వారు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. విషయం తెలుసుకున్న బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుకూరి మధుసూదన్‌రెడ్డి విషయాన్ని బిఆర్‌ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా వారు వెంటనే స్పందించి కొండపాకలోని సత్యసాయి సంజీవని ఆసుపత్రిలో చేర్పించి ఆపరేషన్‌కు కావాల్సిన సదుపాయాలను ఏర్పాటుచేసి వైద్యులతో మాట్లాడి పాపకు ఆపరేషన్ చేయించారు. ఇదిలా వుండగా శుక్రవారం దౌలాపూర్‌లోని సిద్ధులు స్వగృహానికి వచ్చిన వంటేరు ప్రతాప్‌రెడ్డి వారిని పరామర్శించి రూ.5వేల ఆర్థికసహాయం అందజేశారు. వారివెంట బిఆర్‌ఎస్‌పార్టీ సీనియర్‌నాయకులు వంటేరు శ్రీనివాస్ రెడ్డి, కొన్నె జయమ్మ, నాయకులు వార్డుసభ్యులు తదితరులున్నారు.

# హుస్నాబాద్‌లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

**హుస్నాబాద్ రూరల్, మార్చి 20, ప్రభాతవార్త**


తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఆశా కార్యకర్తలు ఎమ్మెల్యే, మంత్రుల క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించే కార్యక్రమానికి పిలుపునివ్వడంతో హుస్నాబాద్‌లో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేయడం, పని భారం తగ్గించడం, హెల్త్ కార్డులు మంజూరుచేయాలని డిమాండ్‌చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడికి ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జయశ్రీ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం ముట్టడికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుచర్యలు చేపట్టారు. హుస్నాబాద్ ఏసిపి సొదారపు సదానందం, సిఐ కోంద్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లుచేశారు.

హుస్నాబాద్, కొమురవెల్లి ఎస్‌ఐలు పాకాల లక్ష్మారెడ్డి, తోట మహేష్ నేతృత్వంలో హుస్నాబాద్ పరిసర గ్రామాల నుండి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ముట్టడికివస్తున్న ఆశా కార్యకర్తలను అడ్డుకున్నారు. అనంతరం వారిని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట పోలీస్ స్టేషన్లకు తరలించారు. మంత్రి క్యాంపు కార్యాలయం ఎదుట కోహెడ ఎస్‌ఐ పుల్ల అభిలాష్ (సింగం) సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని నియంత్రించారు. ఈసందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం గౌరవవేతనంగా ఇస్తున్న రూ.9వేల రూపాయలు కూడా మూడు నెలలుగా చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు కనీసవేతనం రూ.18వేలుగా నిర్ణయించడంతోపాటు ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డులు, వెటర్నిటీ లీవులు ఇవ్వడంతోపాటు పనిభారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. అరెస్టు అయిన వారిలో దాదాపు 200ల పైన ఆశా కార్యకర్తలు ఉన్నారు.


ఆశా కార్యకర్తలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

# ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

**-మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్**


కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టి పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రుణమాఫీ, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.2500 వంటి హామీలు నెరవేర్చలేదన్నారు. ఆరు గ్యారెంటీలు 420హామీలు అమలుచేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసంచేస్తుందన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలను నిలువునా మోసంచేస్తున్న ఘనత కాంగ్రెస్‌పార్టీకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు వంగ రామచంద్రారెడ్డి, బాసంగారి వెంకట్, కాసనగొట్టు సంతోష్, గాడిపల్లి భాస్కర్, విభీషణ్‌రెడ్డి, తొడుపునూరి వెంకటేశం, మనోహర్, ప్రసాద్, అశోక్, శ్రీనివాస్, సత్యనారాయణ, కెమ్మసారం సంతోష్, సునిల్, కార్తీక్, కనకరాజు, ఉమారెడ్డి, పద్మ పాల్గొన్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న న్యాయమూర్తి

**కొమురవెల్లి, మార్చి 20, ప్రభాతవార్త:**

మండలకేంద్రంలోని శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామిని పెద్దపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మంజుల శుక్రవారం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన న్యాయమూర్తి మంజులకు ఆలయ అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. న్యాయమూర్తి స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి దేవుని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మతల్లికి మంగళహారతులు


కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

**చిన్నకోడూరు, మార్చి 20, ప్రభాతవార్త:**

చిన్నకోడూరు మండలకేంద్రంలో శుక్రవారం గంగపుత్రసంఘం ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి మంగళహారతుల కార్యక్రమాన్ని మహిళలు, గంగపుత్ర ప్రతినిధులు భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో జాలపందిరితో నిర్వహించారు. 24వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి ఇట్టబోయిన శ్రీనివాస్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుడిసె లక్ష్మయ్య, ఫిషర్మెన్ జిల్లా ప్రధానకార్యదర్శి గుండు వెంకటేష్, ఉపసర్పంచి కన్నారెడ్డి, మహిళాసంఘం అధ్యక్షురాలు పంపరి వినోద, గంగా భవాని, గుడిచైర్మన్ మల్యాల ఉప్పలయ్య, మాజీసర్పంచి, బిఆర్‌ఎస్ మండలాధ్యక్షులు కాముని శ్రీనివాస్, పంపరి కనకయ్య, లక్ష్మయ్య, సంఘం సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## అచ్చంపేటలో పంచాంగ శ్రవణం

**నర్సాపూర్, మార్చి 20, ప్రభాతవార్త:**

ఉగాదిని పురస్కరించుకొని నర్సాపూర్ మండలపరిధిలోని అచ్చంపేట గ్రామానికి చెందిన కమ్మరి షణ్ముఖచారి పంచాంగశ్రవణం చేసారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి నీరుడి బిక్షపతి, బాగనోళ్ళ నరసయ్య, బోయిని అంజయ్య, నాగమ్మోల్ల శంకర్, గోవర్ధన్, ఫుల్‌కంటి నరసింహులు, బోయిని వీరయ్య, వీరస్వామి, ఫుల్‌కంటి మల్లేశా, మద్దూరి వీరస్వామి, నరేశ్‌నీరుడి మల్లేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వాస్తవిక కాంగ్రెస్ ప్రజాపాలన బడ్జెట్

**-సిద్దిపేట పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు అత్తు**

**సిద్దిపేట అర్బన్, మార్చి 20, ప్రభాతవార్త:**

రాష్ట్ర సర్కార్ ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్ ప్రజలు పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా ఉందని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎండి ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలకు, సంక్షేమం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, భూభారతిచట్టం అమలు కొత్తగా రెండులక్షలమందికి పింఛన్ వైద్య, విద్యకు గ్రామాల అభివృద్ధితోపాటు అన్నివర్గాలకు పెద్దపీటవేశారని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ అన్నివర్గాల సంక్షేమానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోవడం లేదన్నారు. ఆర్థికశాఖ మంత్రి, డిసిఎం భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టినందులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా పండిట్ దీన్‌దయాల్ జయంతి


దీన్‌దయాల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బిజెపి నాయకులు

**జహీరాబాద్, మార్చి 20, ప్రభాతవార్త:**

పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను శుక్రవారం బిజెపి ఆధ్వర్యంలో పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాలలో ప్రశిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పండిట్ దీన్‌దయాల్ చిత్రపటానికి పూజాకార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ సూచించిన మార్గంలో బిజెపి పయనిస్తోందన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గొల్ల భాస్కర్, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు బొగ్గుల సంతోష్, అప్పం శ్రావణ్, మహిళా మోర్చా నాయకులు శోభారాణి, అనిత స్వామి, అర్చన, శారద, ఉమారాణి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుభాష్‌రెడ్డి, మల్లికార్జున్‌పాటిల్, సుధీర్ బండారి, శ్రీనివాస్‌గుప్తా, బక్కయ్యగుప్తా, సునీల్ కుమార్, సుమ అనిల్, మారయ్య, పాలింకర్ సంతోష్, అనిరుధ్‌రెడ్డి, బండి వెంకట్, సురేష్‌పూరి, మహేష్, అక్షయ దేశ్‌పాండే, రాజ్‌కుమార్‌రెడ్డి, నందు స్వామి, చంద్రశేఖర్, ఎంజి దుర్గయ్య, నెలవాలం జగన్, విజయ్ రామ్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, సిద్ధప్ప, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయండి

**-బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**

**సంగారెడ్డి టౌన్, మార్చి 20, ప్రభాతవార్త:**

కాంగ్రెస్‌పార్టీ శాసనసభ ఎన్నికల సందర్భంగా చేసిన హామీలన్నీ అమలు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి డిమాండ్‌చేశారు. శుక్రవారం బిజెపినాయకులతో కలిసి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చేసిన అనేక హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్‌ప్రభుత్వం విఫలం అయిందని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లాలో రైతులు తీవ్రంగా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, రైతుభరోసా సమయానికి అందకపోవడంతో అన్నదాతలు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వితంతు, దివ్యాంగులకు అర్హులైన వారికి చేరడంలేదని విచారం వ్యక్తంచేశారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అనేకమంది అర్హులకు పెన్షన్లు అందడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి గృహాలను మంజూరుచేయాలని డిమాండ్‌చేశారు. భూభారతి రెవిన్యూ సదస్సులో ప్రజలు అందచేసిన దరఖాస్తులు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని విచారం వ్యక్తంచేశారు. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు కాంగ్రెస్‌పార్టీ చేసిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని గోదావరి అంజిరెడ్డి డిమాండ్‌చేశారు.

## రాష్ట్రస్థాయి కల్చరల్ ఈవెంట్‌లో మెరిసిన భూక్య రమేష్

**హుస్నాబాద్ రూరల్, మార్చి 20, ప్రభాతవార్త:**

హుస్నాబాద్ మండలం బల్లునాయక్ తండాకు చెందిన భూక్య రమేష్ రాష్ట్రస్థాయిలో జరిగిన కల్చరల్ ఈవెంట్‌లో ప్రతిభచాటుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల తరపున జాతీయస్థాయిలో జరిగే కల్చరల్ ఈవెంట్లో పాల్గొనే అవకాశం రావడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్ వేషధారణలో మెరిసిన భూక్య రమేష్ రాష్ట్రస్థాయి పోటీల నుంచి జాతీయస్థాయికి ఎంపిక పట్ల తండాకు చెందిన ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## అతిమ్యాలలో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు చేపడుతున్న దృశ్యం

**మనూర్, మార్చి 20, ప్రభాతవార్త:**

పరిధిలోని అతిమ్యాలగ్రామంలో పారిశుధ్యపనులు చురుకుగా కొనసాగుతున్నాయి. గ్రామంలోని ఆయా వార్డులలో అపరిశుభ్రత లేకుండా, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచి విద్యాసాగర్ పేర్కొన్నారు. గ్రామస్థులు ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని సూచించారు. మురుగుకాల్వలను శుభ్రంచేయించడంతో పాటు కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు సర్పంచి పేర్కొన్నారు.

## పెండింగ్ గౌరవవేతనాలు విడుదల చేయాలి

**-ఆశా వర్కర్ల డిమాండ్.. ఆర్డీవోకు వినతి**


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్‌లు

**నర్సాపూర్, మార్చి 20, ప్రభాతవార్త:**

గత రెండునెలలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవవేతనాలను వెంటనే విడుదలచేసి చెల్లించాలని కోరుతూ రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని ఆశా కార్యకర్తలు శుక్రవారం నర్సాపూర్ ఆర్డీఓ రామకృష్ణకి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు తమగోడును వెళ్లబోసుకుంటూ వినతిపత్రంలో పేర్కొన్నారు. అనేక విధాలుగా సేవలు అందిస్తున్న తమకు ఎటువంటి ప్రమాద బీమా సౌకర్యం లేదని, అలాగే ఉద్యోగభద్రత పర్మినెంట్ కల్పించాలనే డిమాండ్‌ను వారు ఈ సందర్భంగా లేవనెత్తారు. కనీసవేతనం అమలుచేస్తూ, తమను పర్మినెంట్ చేయాలని, తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీలమ్మతోపాటు సంధ్య, అనిత, లత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యదర్శిగా రామాగౌడ్

**నర్సాపూర్, మార్చి 20, ప్రభాతవార్త:**

కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్‌పార్టీ జిల్లాకమిటీని ఎన్నికచేసిన నేపథ్యంలో నర్సాపూర్ మండలం ఇబ్రహీంబాద్‌గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు మరాఠీ రామాగౌడ్‌ను కాంగ్రెస్‌పార్టీ జిల్లాకార్యదర్శిగా నియమించడం జరిగింది. ఈసందర్భంగా పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌ద్వారా నియామకపు ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా మరాఠీ రామాగౌడ్ టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్‌కు, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఈద్గా వద్ద బాంబు స్క్వాడ్ తనిఖీ

**అల్లాదుర్గం, మార్చి 20, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన అల్లాదుర్గంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఈద్గాల వద్ద రంజాన్ పండగను పురస్కరించుకుని ముస్లింలు ప్రార్థనలు చేసే ఈద్గా వద్ద శుక్రవారం మెదక్ బాంబు స్క్వాడ్‌లతో జిల్లా ఎస్పి డివి శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు ఎస్‌ఐ శంకర్ తనిఖీలు నిర్వహించారు. శనివారం రంజాన్ పండగ ప్రశాంతంగా ముగిసేలా పోలీసులు తమ వంతు చర్యలు తీసుకుంటున్నారు. రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకునేలా ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలని ఎస్‌ఐ శంకర్ మండల ప్రజలకు ఈ సందర్భంగా సూచించారు.


ఈద్గా వద్ద బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ శంకర్

## మావినెల్లి జాతరలో కుస్తీ పోటీలు

**నాగల్‌గిద్ద, మార్చి 20, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని మావినెల్లి గ్రామంలో శ్రీచెన్నబసవేశ్వర జాతర మహోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని చెన్నబసవేశ్వరుడిని దర్శించుకున్నారు. జాతరను పురస్కరించుకుని నిర్వహించిన కుస్తీ పోటీల్లో మల్లయోధులు కుస్తీపడ్డారు. కుస్తీపోటీల్లో ప్రతిభ చాటిన మల్లయోధులకు బహుమతులను అందచేశారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


మావినెల్లి జాతరలో కుస్తీ పడుతున్న మల్లయోధులు